

'రైవాడ'పై నిర్లక్ష్యపు నీడ!

- జలాశయం లోపల పేరుకుపోయిన తుప్పలు
- గట్టు మొత్తం గోతులమయం
- పట్టించుకోని అధికారులు
- సమీప గ్రామాల ప్రజల రాకపోకలకు అవస్థలు



- వార్త 5వ పేజీలో

పడకేసిన నాడు-నేడు పనులు

సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనుల్లో జాప్యం

- చాలా కళాశాలల్లో అసంపూర్తి నిర్మాణాలు దర్శనం
- కాలేజీలు తెరిచే నాటికి పనులు పూర్తి కావడం అనుమానమే

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రెండో విడత కింద ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టిన నాడు- నేడు పథకం పనులు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. దీంతో చాలా కళాశాలల్లో అసంపూర్తి నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి.



పాయకరావుపేట ప్రభుత్వ కళాశాలలో నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు

ప్రభుత్వం రెండో విడత కింద జిల్లాలో 2021 ఆగస్టు నెలలో 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాడు- నేడు పథకం పనులు ప్రారంభించింది. రూ.15.48 కోట్ల అంచనా వ్యయంతో 180 నిర్మాణ పనులను చేపట్టేందుకు నిర్ణయించింది. వాస్తవానికి ఈ పనులు 2022 నాటికి పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ పనుల్లో పురోగతి కానరాలేదు. 2023 సెప్టెంబరు నాటికి పూర్తి చేయాలని గడువు పెంచినా పనులు నత్తనడకనే సాగాయి. చేసేది లేక 2024 జనవరి నాటికి ఇప్పటికే చేపట్టిన మొత్తం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కానీ కేవలం 60 శాతం పనులు మాత్రమే పూర్తి చేయగలిగారు. అత్యధిక కళాశాలల్లో నిర్మాణ పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి.



పాయకరావుపేట ప్రభుత్వ కళాశాలలో నిలిచిపోయిన కళా వేదిక పనులు

బిల్లులు అందక.. పనులు సాగక..

జిల్లాలో ఇప్పటి వరకు సుమారు రూ.7 కోట్ల విలువైన నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు కళాశాలల్లో చేశారు. అయితే రూ.6 కోట్లుకు మాత్రమే బిల్లులు మంజూరయ్యాయి. ఇంకా రూ.కోటి మేర బిల్లులు రావలసి ఉండడంతో చాలా చోట్ల కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడ, నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటు వంటి పనులకు సకాలంలో బిల్లులు రాక పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. కె.కోటపాడు, పాయకరావుపేట జూనియర్ కళాశాలల్లో చేపట్టిన మరుగుదొడ్ల పనులు ప్రస్తుతం పడకేశాయి.

కళాశాలలు తెరిచేలోగా పూర్తయ్యేనా?

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టిన నాడు- నేడు పథకం పనులు కళాశాలల పునఃప్రారంభం నాటికి పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఇన్నాళ్లూ జాప్యం చేసుకుంటూ వచ్చిన ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ముందు నిధులు విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. అయితే కళాశాలల్లో గత రెండు నెలలుగా ఎన్నికల నేపథ్యంలో పనులు జరగడం ... మిగతా 6వ పేజీలో



ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్‌గున్నీ

ఓట్ల లెక్కింపునకు పటిష్ఠ చర్యలు

- విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్‌గున్నీ

అనకాపల్లి రూరల్, మే 20: ఓట్ల లెక్కింపునకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్టు విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్‌గున్నీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని ఫ్యూచర్ వరల్డ్ పాఠశాలలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లను ఎస్పీ కేవీ మురళీకృష్ణతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంల భద్రత ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఓట్ల లెక్కింపు రోజున 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉండేలా చూడాలన్నారు. లెక్కింపు ముగిసిన తరువాత ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు చేయకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఏఎస్పీ వి జయభాస్కర్, అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజు, ఎస్బీ డీఎస్పీ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- అర్బన్‌లో 4 కేంద్రాలు, రూరల్‌లో 16 పరీక్షా కేంద్రాలు
- జిల్లాలో పరీక్షలు రాయనున్న విద్యార్థులు 14,807 మంది

అనకాపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ రెగ్యులర్ పరీక్షలు జరిగాయి. ఈ ఫలితాలు గత నెల 12న విడుదలయ్యాయి. వీరిలో ఉత్తీర్ణులు కాలేకపోయిన ... మిగతా 6వ పేజీలో

మురుగునీరు తాండవం!

వ్యర్థాలు, రెండు జిల్లాల డ్రైనేజీల అవుట్‌లెట్లు తాండవ నదిలో కలవడంతో కలుషితం

- వ్యాధుల బారిన పడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు



మురుగునీరు, చెత్తతో అధ్వానంగా ఉన్న తాండవ నది

పాయకరావుపేట, మే 20:

తాండవ నది జలాలు కలుషితమయ్యాయి. పాయకరావుపేట పట్టణ పరిధిలో అనకాపల్లి, కాకినాడ జిల్లాల సరిహద్దుగా ప్రవహిస్తున్న ఈ నదిని రెండు పట్టణాల ప్రజలు డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తుండడంతో పాటు రెండు పట్టణాల డ్రైనేజీల అవుట్‌లెట్లు నదిలోకి ఏర్పాటు చేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఈ నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు కూడా కలుషితమై ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

పాయకరావుపేట, తుని నియోజకవర్గాల్లోని సుమారు 18 వేల ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో 2009లో పాయకరావుపేట వద్ద తాండవ నదిపై భూమి, ముఠా ఆనకట్టలు నిర్మించారు. అయితే ఈ రెండు పట్టణాలకు డంపింగ్ యార్డులు లేని కారణంగా పాయకరావుపేట పంచాయతీ, తుని మునిసిపాలిటీలు రోజూ టన్నుల కొద్దీ సేకరించిన చెత్తను పట్టణంలో ముఠా ఆనకట్ట వద్ద తాండవ నదిలో వేస్తుండడంతో నదిలో చెత్త పేరుకుపోతోంది. దీనికి తోడు రెండు పట్టణాల మురికి కాలువల అవుట్‌లెట్లు ఎక్కడికక్కడ నదిలోకి పెట్టడం వల్ల పట్టణ పరిధిలో ఆనకట్టల మధ్య స్టోరేజి ఏరియాలో నిల్వ నీరు కూడా వ్యర్థ జలాలుగా మారుతున్నాయి. ఈ నీరు నేరుగా భూమిలోకి ఇంకుతూ భూగర్భ జలాల కలుషితమవుతుండడంతో నది పరీవాహక ప్రాంతాల్లో బోర్లు, బావుల్లో లవణాలు కలిగిన నీరు ఊరుతోంది. దీనికి తోడు ఈ నది వ్యాధులకు కారణమయ్యే దోమల ఉత్పత్తి కేంద్రంగా మారి రెండు పట్టణాల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలకు తాగునీరందించే తాండవ నదిలో చెత్త పేరుకుపోయి భూగర్భ జలాలు కలుషితమవుతున్నా పట్టించుకున్నవారులేరని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నదిలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



6వ వార్డులో మురుగునీరు తాండవ నదిలోకి ప్రవహిస్తున్న దృశ్యం

నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి




ఏటా వేల ఎకరాలకు సాగునీటిని అందజేయడంతోపాటు పాయకరావుపేట, తుని పట్టణాల ప్రజానీకానికి తాగునీరు అందజేస్తున్న తాండవ నది జలాలు కలుషితం కాకుండా రక్షించాలని గత కొన్నేళ్లుగా పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడం దారుణం. రెండు పట్టణాల్లో రోజూ సేకరిస్తున్న చెత్తను తాండవ నదిలో వేయడం వల్ల నది జలాలు కలుషితమై తాండవ ఆయకట్టు భూముల్లో పంటలు, ప్రజల ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతోంది. ఇప్పటికైనా పాయకరావుపేట పంచాయతీ అధికారులు స్పందించి తాండవ నదిలో చెత్తవేయకుండా చర్యలు తీసుకోవాలి.

- వెలుగుల అర్జునరావు,
తాండవ నది పరిరక్షణ సమితి, కన్వీనర్

రేపటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

- ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడమే కారణం
- జిల్లాలో రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్లు...

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి):




ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా అందించే సేవలను ఈ నెల 22 నుంచి నిలిపివేయాలని నెట్‌వర్క్ పరిధిలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల అసోసియేషన్ నిర్ణయించింది. ప్రభుత్వం గడిచిన కొన్ని నెలల నుంచి బకాయిలను చెల్లించకపోవడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది.

రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.1,500 కోట్లు చెల్లించాల్సి ఉండగా, విశాఖలో 50కుపైగా ఆస్పత్రులకు రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్లు వరకూ చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు మూడుసార్లు సమ్మె నోటీసులు ఇవ్వగా రెండు పర్యాయాలు రూ.300 కోట్లు వరకూ విడుదల చేసింది. అయినప్పటికీ బకాయిలు భారీగానే ఉండడంతో ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా ఉందని ఆస్పత్రుల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఈ నెల పదో తేదీన రూ.500 కోట్లు విడుదల చేస్తామని ఆరోగ్యశ్రీ సీఈవో ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో ఆస్పత్రులు సమ్మెకు సిద్ధమవుతున్నాయి. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే పూర్తిస్థాయిలో వైద్య సేవలు నిలిపివేస్తామని హెచ్చరిస్తున్నాయి.

పలు రైళ్లు రద్దు

- జాబితాలో సింహాద్రి ఎక్స్‌ప్రెస్, విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్, విశాఖపట్నం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లు
- విశాఖ-రాజమండ్రి మెము రైళ్లు కూడా...

విశాఖపట్నం, మే 20: దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో భద్రతాపరమైన నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈనెల 27 నుంచి జూన్ 23వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేశామని వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 27 నుంచి జూన్ 22వ తేదీ వరకూ మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243), తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (22708), ఈనెల 28 నుంచి జూన్ 23వ తేదీ వరకు విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244), విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (22707) రద్దు చేశారు. అలాగే ఈనెల 27 నుంచి జూన్ 23వ తేదీ వరకు విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701), గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22702), రాజమండ్రి-విశాఖ మెము (07466), విశాఖ-రాజమండ్రి మెము (07467) రైళ్ల రద్దు చేసినట్టు వెల్లడించారు.



తాగునీటి సరఫరా అస్తవ్యస్తం

పూర్తిగా పాడైపోయిన ప్రధాన పైపులైన్

- తుప్పు పట్టి రంధ్రాలు పడడంతో నీరు వృథా
- పలు చోట్ల డ్రైనేజీల్లో పైపులైన్లు ఉండడంతో తాగునీరు కలుషితం
- అందుబాటులోకి రాని సమగ్ర మంచినీటి పథకం
- పట్టణ ప్రజలకు తప్పని కష్టాలు



మంచినీటి సరఫరా పైపునకు మరమ్మతులు చేస్తున్న మునిసిపల్ సిబ్బంది

నర్సీపట్నం, మే 20:

పురపాలక సంఘంలో తాగునీటి సరఫరా పైపులైన్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ప్రధాన పైపులైన్‌తో పాటు వార్డుల్లోని పబ్లిక్ కొళాయి పైపులు సైతం తుప్పు పట్టి రంధ్రాలు పడి చాలా చోట్ల నీరు వృథాగా పోతోంది. దీని వల్ల తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు.

పూర్వం పంచాయతీగా ఉన్నప్పుడు దగ్గాడ, ఉత్తరవాహిని వాటర్ స్కీమ్‌ల కోసం పైపులైన్ వేశారు. నలభై సంవత్సరాలకు పైగా అదే పైపులైన్ మీద తాగునీరు సరఫరా చేస్తున్నారు. మెయిన్ పైపులు పాడైపోయి నీటి సరఫరా సమయంలో లీక్ అవుతున్నాయి. పబ్లిక్ కొళాయి, వ్యక్తిగత కొళాయిలకు సంబంధించిన నీటి సరఫరా పైపులు డ్రైనేజీల్లో ఉండడంతో తుప్పు పట్టి పాడవుతున్నాయి. వెంకునాయుడుపేట, శివపురం, పాత మునిసిపల్ కార్యాలయం సమీపం తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పైపులు డ్రైనేజీల్లోనే ఉన్నాయి. దీని వల్ల తాగునీరు దుర్వాసన వస్తున్నదని స్థానికులు వాపోతున్నారు. తాగునీటి సరఫరా పైపులు మార్చి కొత్తగా పైపులైన్ వేస్తే గాని సమస్య పరిష్కారం కాదు. అదే విధంగా డ్రైనేజీల పక్కనే పబ్లిక్ కొళాయిలు ఉండడం వల్ల నీటి సరఫరా సమయంలో దుర్వాసన భరించలేకపోతున్నామని పలువు మహిళలు వాపోతున్నారు. మునిసిపాలిటీలో ఇంటింటికి తాగునీటి సరఫరా కోసం ప్రభుత్వం రూ.166.89 కోట్లతో సమగ్ర మంచినీటి పథకం మంజూరు చేసింది. పథకం పూర్తి చేస్తే మునిసిపాలిటీలో నీటి కష్టాలు తీరతాయి.



శివపురం డ్రైనేజీలో ఉన్న మంచినీటి పైపులు

ముందుకు సాగని పనులు

సమగ్ర మంచినీటి పథకం పనులు ... మిగతా 6వ పేజీలో

అంగన్‌వాడీ కేంద్రంలో ఆర్‌జేడీ తనిఖీలు



మంగళాపురం అంగన్‌వాడీ కేంద్రం రికార్డులను తనిఖీ చేస్తున్న ఐసీడీఎస్ ఆర్‌జేడీ చిన్మయిదేవి

బుచ్చెయ్యపేట, మే 20: మండలంలోని మంగళాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ ఆర్‌జేడీ చిన్మయిదేవి సోమవారం తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారం పక్కదారి పడితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాధ, తదితరులు పాల్గొన్నారు.

మామిడి మార్కెట్ డల్

- ఈ ఏడాది తగ్గిన దిగుబడి
- వెలవెలబోతున్న తాండవ వంతెన పరిసరాలు

పాయకరావుపేట, మే 20: ఏటా ఈ సీజన్‌లో మామిడి పండ్ల దుకాణాలతో కళకళలాడే తాండవ వంతెన ప్రాంతం ఈసారి వెలవెలబోయింది. ఈ ఏడాది మామిడి పండ్ల దిగుబడి తగ్గడమే దీనికి కారణం. మే నెల మూడో వారం వచ్చినా పాయకరావుపేటలో మామిడి పండ్ల వ్యాపారం ఊపందుకోలేదు.

పాయకరావుపేట మండలంలోని పలు గ్రామాలతో పాటు నక్కపల్లి, ఎస్.రాయవరం, నాతవరం తదితర మండలాల నుంచి మామిడి పండ్లు అధిక మొత్తంలో వస్తుంటాయి. పట్టణంలోని తాండవ వంతెన, గౌతమ్ సెంటర్లు ప్రతి రోజూ ఉదయం పది గంటల వరకు మామిడి పండ్ల దుకాణాలు కళకళలాడుతుండేవి. ఈ ప్రాంతంలో విస్తారంగా పండే బంగినపల్లి, విమాన పసందు, కొత్తపల్లి కొబ్బరి, సువర్ణరేఖ, చెరకు రసాలు, పాపారావుగోవా తదితర రకాలకు మంచి డిమాండ్ ఉండడంతో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, నర్సీపట్నం, కాకినాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి టోకు వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు. అదేవిధంగా మామిడి పండ్ల సీజన్‌లో ప్రతి రోజూ పట్టణంలోని తాండవ వంతెన వద్దకు ఉదయం రైతులు తెచ్చే మామిడి పండ్లను స్థానికంగా ఉండే చిరు వ్యాపారులు కొనుగోలు చేసి ఆ తరువాత అదే స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని సాయంత్రం వరకు చిల్లరగా విక్రయాలు సాగిస్తుంటారు. అయితే ఈ ఏడాది అవసరమైన సమయంలో వర్షాలు పడకపోవడంతో వాతావరణం అనుకూలించక ఈ ప్రాంతంలో మామిడి పంట దిగుబడి 80 శాతం తగ్గడంతో మే నెల వచ్చి మూడు వారాలు కావస్తున్నా పాయకరావుపేట మార్కెట్‌కు పెద్దగా మామిడి పండ్లు రాలేదు. దీని వల్ల పట్టణంలోని తాండవ వంతెన ఫుట్‌పాత్‌లు వెలవెలబోతున్నాయి. కాగా ఈ ఏడాది మామిడి పండ్లకు డిమాండ్ పెరిగి హోల్‌సేల్‌లో కూడా రేటు ఆశాజనకంగా ఉన్నప్పటికీ మామిడి పంట దిగుబడి గణనీయంగా తగ్గిన కారణంగా మామిడి తోటలపై పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు.



తాండవ వంతెన సమీపంలో అక్కడక్కడ ఉన్న మామిడి పండ్ల దుకాణాలు

క్రైం... crime news

అదృశ్యమైన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి


గంగరాజు (ఫైల్)

మాకవరపాలెం, మే 20: గత నాలుగు రోజులుగా అదృశ్యమైన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు మాకవరపాలెం ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని సుభద్రయ్యపాలెం గ్రామానికి చెందిన అట్టుమూరి గంగరాజు (53) తాళ్ళపాలెం వద్ద గల ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి బయల్దేరిన అతడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనతో వెతకసాగారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంతలో సోమవారం పీపీ అగ్రహారం వద్ద సరుగుడు తోటలో గంగరాజు మృతదేహం ఉన్నట్టు సమాచారం తెలుసుకుని అక్కడికి వెళ్లి చూశారు. తోటలో గంగరాజు అనుమానాస్పదంగా మృతిచెంది ఉన్నాడని ఎస్‌ఐ వివరించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

వివాహిత ఆత్మహత్య

గోపాలపట్నం, మే 20: అనారోగ్య సమస్యల కారణంగా ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన 89వ వార్డు పరిధి సంతోశ్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వంతల మోహనరావు అనే రైల్వే ఉద్యోగి భార్య పైడమ్మ (కమల), నలుగురు పిల్లలతో కలిసి కొత్తపాలెంలోని సంతోశ్‌నగర్ కాలనీలో నివసిస్తున్నారు. ఈ నెల 18న మోహనరావు తమ కుమారుడితో కలిసి తిరుపతి వెళ్లారు. ఆదివారం రాత్రి భోజనాలు చేశాక కమల ఒంటరిగా ఇంట్లో నిద్రించగా, ముగ్గురు పిల్లలు మేడపై పడుకున్నారు. అయితే సోమవారం ఉదయం పిల్లలు కిందకు వచ్చి చూసేసరికి తల్లి వంట గదిలోని ఫ్యాన్ హుక్కుకు చీరతో ఉరి వేసుకుని ఉండడం చూసి స్థానికులకు తెలిపారు. వారు వచ్చి చూసేసరికే ఆమె మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకున్న ఎస్‌ఐ రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించి, ఘటనపై ఆరా తీశారు. కమల అనారోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని కుటుంబీకులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చి కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

తగరపువలస, మే 20 : జీవీఎంసీ రెండో వార్డు సంతపేటలో సోమవారం పిచ్చి కుక్క దాడి చేయడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సంతలో కూరగాయలు అమ్మడానికి వచ్చిన సూరయ్యపై దాడి చేసిన పిచ్చి కుక్క అక్కడికి సమీపంలోనే సీరపు లోకేష్, అభిరామ్ అనే చిన్నారులను కూడా గాయపర్చింది. స్థానికులు బాధితులను పట్టణ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కాగా ఈ ప్రాంతంలో కుక్కల సంచారం అధికం కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. కూడళ్లలో గుంపుగా చేరి పాదచారులు, వాహనదారులపై దాడికి పాల్పడుతు న్నాయి. ముఖ్యంగా రాత్రి వేళ వాహనాల వెంట పరుగు తీస్తుండడంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.

'రైవాడ'పై నిర్లక్ష్యపు నీడ!

- జలాశయం లోపల పేరుకుపోయిన తుప్పలు
- గట్టు మొత్తం గోతులమయం
- పట్టించుకోని అధికారులు
- సమీప గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు


గోతులతో దర్శనమిస్తున్న గట్టు


జలాశయం గర్భంలో పేరుకుపోయిన తుప్పలు

దేవరాపల్లి, మే 20 : మండలంలోని రైవాడ జలాశయంపై నిర్లక్ష్యపు నీడ వీడడం లేదు. ఏళ్ల తరబడి దీనిని పట్టించుకునేవారు కరువయ్యారు. ఫలితంగా జలాశయ గర్భంలో తుప్పలు పేరుకుపోగా, బయట గట్టు అత్యంత దారుణంగా తయారైంది. పెద్ద పెద్ద గోతులు పడడంతో దీనిపై అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంది. జలాశయం గట్టు మొత్తం 5.5 కిలోమీటర్లు పొడవు కాగా, దాదాపు గట్టం ఇదే తరహాలో ఉంటుందని పలువురు వాపోతున్నారు. సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని ఐదేళ్ల క్రితం ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక దీనిని పట్టించుకున్న దాఖలాలు లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జలాశయం గట్టు ఎప్పటికప్పుడు పటిష్టం చేయాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు చేపట్టలేదని అంటున్నారు. భారీ వర్షాలు కురిసే సమయాల్లో జలాశయంలో నీరు పుష్కలంగా చేరితే అదనపు నీరు కిందకు పోయే విధంగా గట్టు ఉండాలి. కాని ప్రస్తుతం గట్టు పరిస్థితి చూస్తే అత్యంత దారుణంగా ఉందని అంటున్నారు. దీంతో చిన సోంపురం నుంచి రైవాడకు వచ్చే మార్గంలో గట్టుపై వేసిన రోడ్డు పూర్తిగా పాడైంది. పెద్ద పెద్ద గోతులు పడడంతో మట్టిని ఆయా గుంతల్లో కప్పి చేతులు దులుపుకున్నారు. అంతేకాక గట్టు మీదుగా తామరబ్బ, చింతలపూడి పంచాయతీలకు వెళితే మూడు కిలోమీటర్లు వరకు దూరం కలిసి వస్తుంది. అలాగే, అనంతగిరి, అరకు, ఎస్.కోట వెళ్లడానికి దగ్గర మార్గం కూడా ఇదని అంటున్నారు. కానీ ఈ మార్గం సక్రమంగా లేకపోవడంతో చుట్టూ తిరిగి కాశీపురం మీదుగా చినసోంపురానికి రావాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గట్టుపై రోడ్డు దుస్థితి ఇలా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదిలావుంటే, జలాశయం గర్భంలో తుప్పలుతో పేరుకు పోయాయి. దీని వలన చెట్ల వేర్లు రాతికట్టులోకి వెళ్లి గట్టు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గట్టును పటిష్టం చేయడంతో పాటు దీనిపై ఉన్న మార్గాన్ని అభివృద్ధి చేయాలని, జలాశయం గర్భంలోని చెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

కౌంటింగ్ ముగిసేవరకు సంయమనం పాటించండి

- డీజేలు, బాణసంచా నిషేధం
- సమస్యాత్మక గ్రామాల్లో పెట్రోలింగ్, పికెటింగ్
- పెట్రోల్ లూజ్ అమ్మకాలు నిషేధం
- పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ


గుల్లేపల్లిలో బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ

సబ్బవరం, మే 20: ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ పూర్తయ్యేవరకూ ప్రజలు సంయమనం పాటించాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం ఎస్పీ కేవీ మురళీకృష్ణ, విశాఖ ఎస్పీ విశాల్‌గున్నీ ఆదేశాల మేరకు స్థానిక సీఐ పిన్నింటి రమణతో కలిసి పలు గ్రామాల్లో బాణసంచా తయారీ కేంద్రాలు, పెట్రోల్ బంకులను సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పరవాడ సబ్‌డివిజన్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలు సహకరించారని, ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకూ అదేవిధంగా ఉండాలని కోరారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. పండగలు, శుభకార్యాల్లో స్టేజ్ ప్రోగ్రామ్‌లు, ఊరేగింపులు, డీజే సౌండ్లు, బాణసంచా పేలుళ్ల నిషేధించామన్నారు. బెట్టింగ్, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సత్యనారాయణ హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో పెట్రోలింగ్, పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. లూజ్ పెట్రోలు అమ్మకం నిషేధించామన్నారు. రాజకీయ నేతలు సభలు, సమావేశాలు ఏర్పాటుకు తప్పనిసరిగా ఆర్వో అనుమతులు తీసుకోవాలని సూచించారు. కవ్వింపు చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ప్రజలకు, అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

చేపల వేట సమయంలో మత్స్యకారులు జాగ్రత్తలు వహించాలి

- మెరైన్ పోలీస్ సీఐ గోవిందరావు


సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

అచ్యుతాపురం, మే 20: మత్స్యకారులు సముద్ర వేట సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పూడిమడక మెరైన్ పోలీస్ సీఐ గోవిందరావు అన్నారు. సోమవారం కోస్ట్ గార్డులు పూడిమడకలో మత్స్యకాలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు సముద్రంలో చేపల వేట చేసే సమయంలో అనారోగ్యానికి గురైతే వెంటనే 1554 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలన్నారు. అలాగే వేట సమయంలో అపరిచిత బోట్లు, వ్యక్తులు కనబడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. మత్స్యకారులు అందించే ప్రతి సమాచారాన్ని తాము ముఖ్యంగా తీసుకొని వెంటనే స్పందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ సిరాజ్ బాబు, పల్లి రాజేష్, ఎం. వెంకటరావు, అంకిత్, కంటుముచ్చు ముసలి, పి.శ్రీనివాసరావు, కదిరి గుర్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతోనే సత్వర న్యాయం

- విశాఖ జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి రాధారత్నం


శిబిరంలో పాల్గొన్న న్యాయాధికారులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు రాధారత్నం

విశాఖపట్నం (లీగల్), మే 20 : న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంతో పాటు సత్వర న్యాయానికి మధ్యవర్తిత్వం దోహదపడుతుందని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు కె. రాధారత్నం అన్నారు. సుప్రీంకోర్టు మీడియేషన్ కన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ, ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా నూతన కోర్టుల కాన్ఫరెన్సు హాలులో న్యాయాధికారుల ఐదు రోజుల శిక్షణా శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వానికి సంబంధించిన మెళుకువలను న్యాయాధికారులు తెలుసుకొని కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా వివాహ సంబంధ వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మీడియేషన్ కన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ జాతీయ శిక్షకులు వీకే బన్సల్, సునీల్ కుమార్ అగర్వాల్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 29 మంది న్యాయాధికారులు, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

నిర్మాణాత్మక బోధనా పాఠ్య ప్రణాళికలపై శిక్షణ

అనకాపల్లి రూరల్, మే 20: జిల్లాలోని తేగాడ ఆదర్శ పాఠశాలలో సోమ, మంగళవారాల్లో సీబీఎస్ఈ గల ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఇంగ్లీషు, జీవశాస్త్రం, సోషల్ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మాణాత్మక బోధనా పాఠ్య ప్రణాళికలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ శిక్షణకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి 294 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (పాఠశాల విద్య) విజయభాస్కర్ హాజరై పలు సూచనలను చేశారన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు


వాడచీపురుపల్లిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

పరవాడ, మే 20 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు వచ్చే నెల నాలుగో తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో కేంద్ర బలగాలు సోమవారం గ్రామాల్లో కవాతు నిర్వహించాయి. ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం, పరవాడ గ్రామాల్లో కవాతు నిర్వహించాయి. బెట్టింగ్‌లు, వివాదాలకు దూరంగా ఉండాలని, స్టేజి ప్రోగ్రాలు నిర్వహించకూడదని సీఐ బాలసూర్యారావు అన్నారు. ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో జరగడానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	138.00
లైవ్ ధర	158.00
విత్ స్కిన్	286.00
స్కిన్ లెస్	296.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

రోడ్లపైనే వానర మూక సంచారం

- ఇళ్లు, రోడ్లపైన దాడులు
- ఏడాది తర్వాత తెర మీదకు సమస్య
- కోతులను పట్టించాలని కోరుతున్న పట్టణవాసులు


కొత్తపేట ప్రధాన రోడ్డుపై సంచరిస్తున్న వానర మూక

ఎలమంచిలి, మే 20 : పట్టణ వీధుల్లో విచ్చలవిడిగా వానరాల మూక సంచరిస్తుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఇళ్లపైన, చెట్లపైన సంచరించే వానరాలు ఇటీవల రోడ్లపైనే సంచరిస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏడాది కాలం నుంచి వానరాల సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఆరేళ్ల క్రితం వానర మూక సమస్య తీవ్రతరం కావడంతో అప్పటి మునిసిపల్ అధికారులు వానరాల పట్టివేత కార్యక్రమాన్ని చేపట్టి అటవీప్రాంతాలకు తరలించారు. మరలా ఏడాది నుంచి వానరాల సమస్య తెర మీదకు వచ్చింది. వానరమూక కారణంగా ఇళ్లలోని వస్తు సామగ్రితో పాటు తినుబండారాలు, పండ్ల జాతి మొక్కలపై తమ ప్రతాపాన్ని ప్రదర్శిస్తూ నష్టపరుస్తున్నాయి. వానరాలు ఇళ్లలోనూ, వీధుల్లో సైతం ప్రజలపై దాడి చేస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మునిసిపల్ అధికారులు వానరాల సమస్యను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎర్రాజీ జ్యోతి ఖాతాలో మరో పసిడి పతకం


పతకాలు సాధించిన జ్యోతి

విశాఖపట్నం (స్పోర్ట్సు), మే 20: నెదర్లాండ్‌లో ఆదివారం రాత్రి జరిగిన హ్యారీ స్కల్డింగ్ గేమ్స్ అథ్లెటిక్స్‌లో నగరానికి చెందిన ఎర్రాజీ జ్యోతి స్వర్ణ పతకం సాధించింది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రేస్‌ను 13.06 సెకన్లలో పూర్తిచేసి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఇటీవల హంగేరీలో జరిగిన 100 మీటర్ల హర్డిల్స్‌లోనూ జ్యోతి స్వర్ణ పతకం సాధించింది. కాగా జూన్ 30వ తేదీతో ఒలింపిక్స్ క్వాలిఫైయింగ్ మీట్స్ ముగియనున్న నేపథ్యంలో అప్పటిలోగా జ్యోతి మరో ఐదు మీట్స్‌లో పాల్గొనాల్సి ఉంది. అయితే ఈ నెలలో వరుసగా జరిగిన రెండు అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్స్‌లో స్వర్ణ పతకాలు సాధించిన నేపథ్యంలో త్వరలో జరగనున్న ఈవెంట్లలోనూ ప్రతిభ కనబరుస్తుందని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావుతో పాటు ఇతర ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.

వలంటీర్లు సరిగా సహకరించలేదు

- చోడవరం వైసీపీ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి వెల్లడించిన నేతలు
- కొందరు నాయకులు సైతం ప్రత్యర్థులతో కుమ్మక్కయ్యారని విప్ ఆరోపణ
- వారికి తగిన బుద్ధి చెప్పుతానని ధర్మశ్రీ హెచ్చరిక



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం, మే 20: సార్వత్రిక ఎన్నికల్లో వలంటీర్లు అనుకున్న విధంగా తమకు సహకారం అందించలేదని కొందరు నాయకులు విప్, చోడవరం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ వద్ద వాపోయారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో ధర్మశ్రీ సమావేశమయ్యారు. తొలుత ఎన్నికల్లో పోలింగ్ శాతం తీరుతెన్నులను సమీక్షించారు. ఈ సందర్భంగా కొన్ని పంచాయతీలకు చెందిన నాయకులు మాట్లాడుతూ తాము నియమించిన వలంటీర్లే ఎన్నికల్లో తమకు అనుకూలంగా పనిచేయకుండా వ్యవహరించారని ఆరోపించారు. దీనివల్ల అనుకున్న స్థాయిలో ఓట్లు రాబట్టలేకపోయామని వెల్లడించారు. పార్టీలో కొందరు నాయకులు సైతం ప్రత్యర్థులతో కుమ్మక్కై పార్టీకి దెబ్బకొట్టే విధంగా వ్యవహరించారని, అటువంటి వారికి తగిన బుద్ధి చెపుతానని ధర్మశ్రీ హెచ్చరించారు. కాగా నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో వైసీపీ విజయం సాధిస్తుందన్నారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్నకు ఒడిశా దాసుడు పూజలు


నడచి వస్తున్న ఒడిశా దాసుడు

సింహాచలం, మే 20 : ఒడిశాలోని బరంపురం జిల్లా పట్టుపురం గ్రామానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకో దాసుడు సోమవారం వరాహలక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. ఏటా స్వామివారి నిజరూప దర్శనం చందనోత్సవం తరువాత బంధుమిత్రులు, శిష్య పరివారంతో ఆయన సింహగిరికి వచ్చి మూడు నెలలు పాటు తమ భవనంలో బస చేసి ప్రతిరోజూ స్వామివారిని పూజించడం ఆనవాయితీ. ఈమేరకు ఆయన స్వామిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని నూనె భండారం వద్ద ప్రత్యేక దీపారాధనలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మామిడి విక్రయదారులపై దాడులు

- మూడు బృందాలు ఏర్పాటు
- జ్ఞానాపురం పండ్ల మార్కెట్‌లో 125 ఇథోపాన్ ప్యాకెట్ల సీజ్
- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్
- రసాయనాల వినియోగంపై స్పందించిన జేసీ


మామిడి విక్రయదారులపై దాడులు చేస్తున్న అధికారులు... (ఇన్‌సెట్‌లో) రసాయనాలు కలిపిన మామిడికాయలు

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): మామిడిని మగ్గబెట్టేందుకు రసాయనాలు వినియోగిస్తున్న వ్యాపారులపై అధికారులు దృష్టిసారించారు. 'మామిడిపై రసాయనాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఆదివారం కథనం ప్రచురించిన విషయం తెలిసిందే.దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ రసాయనాలు వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా ఆహార భద్రతా, ప్రమాణాల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జీఏబీ నందాజీ మూడు బృందాలను ఏర్పాటుచేసి తనిఖీలు నిర్వ హించారు. జ్ఞానాపురంలోని పండ్ల మార్కెట్‌లో నందాజీ ఆధ్వర్యంలోని బృందం నిర్వహించిన తనిఖీల్లో శ్రీదుర్గా పండ్ల దుకాణంలో 30 క్రేట్లలో 125 ఇథోపాన్ ప్యాకెట్లు ఉండడాన్ని గుర్తించారు. ఈ ప్యాకెట్లను సీజ్ చేసిన అధికారులు..మామిడి పండ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా మామిడి వ్యాపారులతో నందాజీ అవగాహన సదస్సును నిర్వహించారు. ఇథలిన్, ఇతర రసాయనాలను వినియోగించకూడదన్నారు. రసాయ నాలు వినియోగించినట్టు తేలితే వ్యాపారులకు భారీ జరిమానాతోపాటు జైలు శిక్ష ఉంటుందని స్పష్టంచేశారు. పండ్లపై రసాయనాలు వినియోగించినట్టు అనిపిస్తే ఎవరైనా తమకు ఫిర్యాదు (98490 47761, 9773683667, 9566760283, 9912199284) చేయవచ్చునని నందాజీ తెలిపారు. మరో రెండు బృందాలు నగర పరిధిలో పండ్ల వ్యాపారం ఎక్కువగా సాగే ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాయి.

పూర్వ విద్యార్థుల వితరణ

» స్నేహితుడికి రూ.70 వేలు సాయం



స్నేహితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పరవాడ, మే 20 : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 పదో తరగతి పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడికి అండగా నిలిచారు. గొర్లివానిపాలెం బీసీ కాలనీలో నివాసముంటున్న అనకాపల్లి నారాయణరావు ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. అతని ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న పూర్వ విద్యార్థులు రూ.70 వేలును సేకరించి సోమవారం అందజేశారు. భవిష్యత్తులో ఏమైనా అవసరముంటే ఆదుకుంటామని నారాయణరావుకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మంగాల సూరిబాబు, బుగిడి రామగోవిందరావు, బండారు చరణ్‌కుమార్, పైలా జోగినాయుడు, పైలా రాము, పి.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను పాటించాలని పోలీసుల ప్రచారం

ఎలమంచిలి, మే 20: కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్ నిబంధనలను పాటించాలని గ్రామాలు, వార్డుల్లో ప్రజలంతా స్నేహపూర్వకంగా మెలగాలని కోరుతూ పట్టణ పోలీసులు సోమవారం ఆటోలో మైక్ ద్వారా ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో ఎటువంటి అల్లర్లకు, గొడవలకు పాల్పడరాదని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ రోజున ఎటువంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ప్రచారం చేపట్టారు.

టెన్త్ విద్యార్థులకు ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాలు



అవార్డులు అందుకున్న విద్యార్థులతో అసోసియేషన్ ప్రతినిధులు

తుమ్మపాల, మే 20 : మాజీముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం అత్యధిక మార్కులు వచ్చిన పదో తరగతి విద్యార్థులకు సిద్దార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాలను అందజేసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు విద్యార్థులకు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో విద్యార్థులంతా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తమ సంస్థ ద్వారా ప్రోత్సాహం ఉంటుందని సంస్థ అధ్యక్షుడు బల్లా నాగభూషణం చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు వైద్య సిబ్బంది వేతనాలు విడుదల చేయాలి

తుమ్మపాల, మే 20 : ఎన్టీఆర్ వైద్యాలయంలో మత్తు వ్యసన విముక్తి కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది వేతన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కేంద్రంలోని సిబ్బందితో కలిసి మాట్లాడారు. అనంతరం సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు లేఖను రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మత్తు వ్యసన విముక్తి కేంద్రాలను నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 కేంద్రాలుండగా వందలాది మంది సిబ్బంది సేవలందిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో తొమ్మిది నెలలుగా వేతన బకాయిలు చెల్లించకపోవడంతో సిబ్బంది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అప్పులు చేసి బతకాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. తక్షణమే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా అధికారులు స్పందించి వేతన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయంలో చదవడమంటే మాకిష్టం



పాటిపల్లి గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

మునగపాక (తుమ్మపాల), మే 20 : మండలంలోని పాటిపల్లి గ్రంథాలయంలో సోమవారం చదవడమంటే మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సిబ్బంది పలు పుస్తకాలను విద్యార్థులకు అందించి చదివించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు వీవీఎస్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ చదవడం ద్వారా జ్ఞానం, జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం బీశెట్టి రామలక్ష్మి విద్యార్థులకు భగవద్గీతను బోధించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆడారి జగ్గఅప్పారావు పాల్గొన్నారు.

సనాతన హిందూ ధర్మం ఆదర్శం

నక్కపల్లి : ప్రపంచానికే భారతీయ సనాతన హిందూ ధర్మం ఆదర్శంగా నిలుస్తుందని హిస్టరీ లెక్చరర్ కాపారావు నాగేశ్వరరావు అన్నారు. నక్కపల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు రామాయణ, మహాభారత ,ఇతిహాసాల గురించి వివరించారు. కుటుంబం, సమాజం, వ్యక్తిత్వం బాగుండాలంటే రామాయణ, మహాభారతం వంటి గ్రంథాలను చదవాలని సూచించారు. గ్రంథాలయాధికారి గోవిందేశ్వరరావు తదితరులున్నారు.

అధ్వాన రహదారితో ప్రమాదాలు



జోడుగుళ్లు నుంచి అమృతపురం మీదుగా షీలానగర్ వెళ్లే మార్గంలో గండివారి కొంపలు వద్ద రోడ్డు దుస్థితి

సబ్బవరం, మే 20 : మండల కేంద్రంలోని జోడుగుళ్ల జంక్షన్ నుంచి అమృతపురం మీదుగా షీలానగర్ వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డుకు ఇరువైపులా అంచులు పూర్తిగా కోతకు గురవడంతో ఆ మార్గంలో రాకపోకలు నిర్వహించే వాహన చోదకులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా జోడుగుళ్ల నుంచి అమృతపురం మధ్య గండివారి ఇళ్ల వద్ద ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై రోడ్డు మధ్యలో భారీ గోతులు ఏర్పడ్డాయి. ఆ ప్రాంతంలో ఆర్అండ్‌బీ కాలువలు పూర్తిగా ఆక్రమణలకు గురవడంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నది. దీంతో రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణికులు, వాహనచోదకులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. ఇటు పంచాయతీ అధికారుల గానీ, ఆర్అండ్‌బీ రెవెన్యూ అధికారులు గానీ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించాలని వారు కోరుతున్నారు.

రాంబిల్లిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకం

» చోద్యం చూస్తున్న అధికారులు

రాంబిల్లి మే 20 : మండల కేంద్రంలోని మహాలక్ష్మిమెట్ట వద్ద అక్రమ గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో గ్రావెల్‌కు గిరాకీ ఉండడంతో స్థానికంగా ఉన్న కొందరు ట్రాక్టర్ల యజమానులు మహాలక్ష్మిమెట్ట వద్ద గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రతి రోజూ రాత్రి వేళల్లో ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్ తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. కొద్ది రోజులుగా తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ గ్రావెల్ రూ.1000 వరకు విక్రయిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి అతి సమీపంలోనే గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రాంబిల్లి మహాలక్ష్మిమెట్ట వద్ద రాత్రి వేళల్లో గ్రావెల్ తవ్వకాలు జరిపిన దృశ్యం

నేత్రపర్వంగా వేణుగోపాలస్వామి కల్యాణం

నక్కపల్లి, మే 20: మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణం ఘనంగా జరిగింది. ప్రతీ ఏటా వైశాఖ శుద్ధ ఏకాదశి రోజున క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులను ఆలయ ఆస్థాన మండపంలో అలంకరించి పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణాన్ని ఆలయ అర్చకుల బృందం ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు,శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, రంగాచార్యులు జరిపించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. నక్కపల్లి మండలం వేంపాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ఆదివారం రాత్రి శ్రీవారి కల్యాణం ఘనంగా జరిగింది.



వేణుగోపాలస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

ఉత్తమ నాటిక 'బంధం'

» విజేతలకు బహుమతులు అందజేసిన దాడి రత్నాకర్

కొత్తూరు, మే 20 : అనకాపల్లిలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు ఈనెల 17, 18, 19 తేదీల్లో అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీలకు జడ్జిలుగా కోరుకొండ శేషగిరిరావు, దండు నాగేశ్వరరావు, వీవీ రామారావు వ్యవహరించారు. ఈ నాటిక పోటీల ముఖ్య నిర్వాహకులు పీసీహెచ్. నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో నాటికల పోటీలు జరుగుతున్నాయన్నారు. అందులో అనకాపల్లికి వచ్చి ప్రదర్శించిన ఆరు సమాజాల కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ నాటిక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా విజయవాడకు చెందిన మైత్రీ కళానిలయం వారి బంధం నాటిక, ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా విశాఖపట్నంనకు చెందిన 'కళాభినయ' నాటిక, ఉత్తమ తృతీయ ప్రదర్శనగా గుంటూరుకు చెందిన అమరావతి ఆర్ట్స్ 'అమృతహస్తం' నాటికకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా ఉత్తమ నటిగా బంధం నాటిక నుంచి రత్నకుమారి, ఉత్తమ నటుడుగా నాలోన నీవే నాటిక నుంచి రామకృష్ణకు, ఉత్తమ దర్శకులుగా బంధం నాటిక నుంచి పీవీ పురుషోత్తం, ఉత్తమ రచయితగా నాన్న బంగారు నాటిక మూర్తికి వ్యక్తిగత బహుమతులను రత్నాకర్ అందజేశారు. అనంతరం దాడి వీరభద్రరావు 45 ఏళ్ల క్రితం రచించిన అనగనగా ఒక రాజు నాటిక విశాఖపట్నం కళాకారులు పీసీహెచ్ నాయుడు బృందంతో ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలను పొందారు.



బంధం నాటిక కళాకారులకు జ్ఞాపిక, నగదు అందజేస్తున్న దాడి రత్నాకర్

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ బర్త్ డే

పాయకరావుపేట, మే 20 : ప్రముఖ సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం శ్రీలక్ష్మి థియేటర్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. నందమూరి కల్చరల్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, కల్చరల్ యూత్ గౌరవాధ్యక్షుడు చింతకాయల రాంబాబు జూనియర్ ఎన్టీఆర్ బర్త్ డే కేక్‌ను కట్‌చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం థియేటర్‌లో జూనియర్ ఎన్టీఆర్ నటించిన ఆది సినిమా ప్రదర్శించారు.కార్యక్రమంలో నందమూరి కల్చరల్ యూత్ నాయకులు విశ్వనాధుని శ్రీను, బత్తిన గోవిందు, గదుల అచ్చుబాబు, మేడిశెట్టి వరహాలు, పక్కుర్తి లోవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని పలు గ్రామాల్లో సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. గోకులపాడులో ఎన్‌టీఆర్ బాయ్స్ బాలురకు క్యారం బోర్డు వితరణగా అందజేశారు. అలాగే అడ్డరోడ్డు, నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్, ఎలమంచిలిల్లో నివసిస్తున్నవారికి భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. కొత్తపోలవరంలో జూనియర్ ఎన్‌టీఆర్ ఫ్యాన్స్ ఉపాధి కూలీలకు ఉదయం టాఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు.

కొత్తూరులో.. అనకాపల్లి పట్టణంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఎన్టీఆర్ పేరు మీద అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుందరయ్యపేటలోని హృదయశాంతి వృద్ధాశ్రమంలో వంద మంది అనాథల సమక్షంలో కేకు కట్ చేశారు. మధ్యాహ్నం వారందరికీ అన్నసమారాధన చేశారు. అదేవిధంగా అనకాపల్లిలో పర్తిసాయి, షిర్డీసాయి సినిమా థియేటర్ల ప్రాంగణంలో అభిమానులు భారీ మందుగుండును వెలిగించి కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో సేవా సమితి సభ్యులు సూరిశెట్టి రమణకుమార్, బుద్ధ జగదీష్‌గాంధీ, అల్లు సురేష్, శరగడం శంకర్, కొయిలాడ ఈశ్వర్, గిరీష్ ఈశ్వర్, సర్వేశ్వరరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో జూనియర్ ఎన్టీఆర్ బర్త్ డే కేక్ కట్ చేస్తున్న దృశ్యం

వేట సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి

» పెంటకోట మెరైన్ సీఐ రమేష్‌కుమార్

ఎస్.రాయవరం, మే 20: మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లే సమయంలో జాగ్రత్తలను తప్పనిసరిగా తీసుకోవాలని పెంటకోట మెరైన్ సీఐ రమేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని బంగారమ్మపాలెంలో మత్స్యకార సంక్షేమ సమితి, కోస్ట్ గార్డు ఆధ్వర్యంలో మత్స్యకారులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెరైన్ సీఐ మాట్లాడుతూ మత్స్యకారులు వేటకు వెళ్లేటప్పుడు ఒంటరిగా కాకుండా అందరితో కలిసి వెళ్లాలని సూచించారు. పడవను సులువుగా గుర్తు పట్టేందుకు జాతీయ పతాకాన్ని ఎగురవేయాలన్నారు. అలాగే ప్రయాణం సమయంలో లైఫ్‌జాకెట్, లైఫ్‌బాయ వంటి వస్తువులను తీసుకువెళ్లాలని అవగాహన కల్పించారు. అలాగే కోస్ట్ గార్డు సిబ్బంది రాజేష్, అంకిత్, వెంకటేష్, మత్స్యకార సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి పరిమెళ్ల వాసు మాట్లాడుతూ వేట సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, పాటించవల్సిన నిబంధనలపై మత్సకారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు మాధవ పాల్గొన్నారు.



బంగారమ్మపాలెంలో అవగాహన కల్పిస్తున్న మెరైన్ సీఐ రమేష్ కుమార్

చిత్రకళా పోటీలతో సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ చేయవచ్చు

» ఎంఈవో కె.చిట్టిబాబు

కొత్తూరు, మే 20 : చిత్రకళా పోటీలతో చిన్నారుల్లోని సృజనాత్మకత, భావవ్యక్తీకరణ వెల్లివిరుస్తుందని మండల విద్యాశాఖాధికారి-1 కె.చిట్టిబాబు అన్నారు. శ్రీగౌరీ గ్రంథాలయంలో 15 రోజులుగా జరుగుతున్న ఉచిత చిత్రలేఖనం శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రాన్ని ఆవిష్కరించడంలో గల నేర్పు, రంగుల కలయిక చిత్రకారుని ప్రతిభను, కళాదృష్టిని తెలియజేస్తాయన్నారు. చిన్నతనం నుంచి విద్యార్థులకు చిత్రకళలో మెలకువలు నేర్పించడం అభినందనీయమన్నారు. శ్రీగౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రంథాలయ మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు బొడ్డేడ సూర్యనారాయణ, గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ), బొడ్డేడ జగ్గ అప్పారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం డ్రాయింగ్ పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగం విజేతలకు ఎంఈవో చిట్టిబాబు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో చిట్టిబాబు, డ్రాయింగ్ శిక్షకులు ఎం. అనిరుద్, సానా లావణ్య, కర్రి హారికలను గ్రంథాలయ కార్యవర్గం ఘనంగా సత్కరించింది.



చిత్ర లేఖనంపై శిక్షణ పొందిన చిన్నారులతో ముఖ్యఅతిథులు

పడకేసిన నాడు-నేడు పనులు

... 3వ పేజీ తరువాయి

లేదు. జూన్ 4న ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాతే పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ విద్యా సంవత్సరంలోనూ ఇంటర్మీడియట్ విద్యార్థులకు మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందని పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై సర్వశిక్షా అభియాన్ ఇన్‌చార్జి ఈఈ రాంప్రసాద్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు జరిగాయన్నారు. ఎన్నికల ప్రక్రియతో సంబంధం లేకుండా కళాశాలలు తెరిచేలోగా కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. సుమారు 60 శాతం పనులు తుది దశలో ఉన్నాయని తెలిపారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు కూడా నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు.

తాగునీటి సరఫరా అస్తవ్యస్తం

... 3వ పేజీ తరువాయి

రెండేళ్ల క్రితం మొదలయ్యాయి. కొన్ని వార్డుల్లో నీటి సరఫరా పైపులైన్ వేశారు. కాంట్రాక్టర్లకు రూ.22 కోట్లు బకాయిలు చెల్లించకపోవడంతో సంవత్సరం కాలంగా పనులు నిలిచిపోయాయి. కొత్త పైపులైన్ కోసం వార్డుల్లో బాగున్న సీసీ రోడ్లు తవ్వేశారు. పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ప్రైవేటు ఆర్వో ప్లాంట్ల నుంచి నీరు కొనుక్కొని తాగుతున్నారు. ప్రతి రోజూ 20 లీటర్ల ప్లాస్టిక్ డబ్బాలతో నీరు తెచ్చుకుంటున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పథకం పనులు పూర్తి చేయించి మంచినీటి సరఫరా సజావుగా సాగేలా చూడాలని వారు కోరుతున్నారు.

గోవాడలో ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

చోడవరం, మే 20: మండలంలోని గోవాడ షుగర్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకల సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జీటీ ఆచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గోవాడ షుగర్స్ ఎండీ వి.సన్యాసినాయుడు, అధికారులు కార్మికులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

... 3వ పేజీ తరువాయి

వారికి, అదేవిధంగా గతంలో సాధించిన మార్కుల కంటే మెరుగైన మార్కుల కోసం బెటర్‌మెంట్ పరీక్షలకు రాసేందుకు సిద్ధమైన విద్యార్థులకు ఈ నెల 24వ తేదీ నుంచి 31వ తేదీ వరకు రెండు పూటలా పరీక్షలు జరిపేందుకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. జిల్లాలో అర్బన్ పరిధిలో 4 సెంటర్లు, రూరల్ పరిధిలో 16 కలిపి మొత్తం 20 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశారు. అర్బన్ పరిధిలో అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం వస్తాయి. మిగిలినవి మండల కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అదేవిధంగా మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. సప్లిమెంటరీ పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 9,326 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 5,481 మంది,, మొత్తం 14,807 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సుజాత తెలిపారు.

పరవాడలో వీధి కుక్కలు స్వైరవిహారం



పరవాడలో గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

పరవాడ, మే 20 : మండల కేంద్రంలో వీధి కుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై వెళ్లేవారిపై దాడికి తెగబడుతున్నాయి. ముఖ్యంగా బొంకులదిబ్బవీధి, సంతబయలు పరిసర ప్రాంతాల్లో కుక్కలు స్వైరవిహారం చేయడంతో వృద్ధులు, చిన్నపిల్లలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. మాంసం దుకాణాలు, హోటల్స్, దాబాల వద్ద పడేసిన మాంసం వ్యర్థాలను తిని పాదచారులతో పాటు ద్విచక్ర వాహనదారులపై దాడి చేస్తున్నాయి. రోజు రోజుకువీధి కుక్కల సంచారం అధికమైపోతున్నప్పటికీ వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'పుచ్చలపల్లి'కి ఘన నివాళి



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న ఉపాధి కూలీలు

అచ్యుతాపురం, మే 20: కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 39 వర్ధంతిని తిమ్మరాజుపేట, జగ్గన్నపేట, ఖాజీపాలెంలలో సోమవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను ఉపాధి కూలీలకు వివరించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగల రాము, పలువురు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అచ్యుతాపురం, మే 20: విద్యుత్ లైన్ల కింద చెట్లు క్లియరెన్స్ చేస్తున్నందున మంగళవారం కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. మండలంలోని రామన్నపాలెం, చీమలాపల్లి, అవసోమవరం, ఆవరాజాం, నారపాక, అచ్యుతాపురం, మోసయ్యపేట, మడుతూరు సెంటర్, సానికాలువ, జేపీ అగ్రహారం, బంగారయ్యపాలెం, అప్పన్నపాలెం, ఎరకన్నపాలెం, తట్టవానిపాలెం, దొప్పెర్ల, ఇరువాడ, చిట్టిబోయినపాలెం, నడింపల్లి గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిబిరం

అచ్యుతాపురం, మే 20: వచ్చే నెల ఏడో తేదీ వరకు గ్రంథాలయంలో వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నామని స్థానిక గ్రంథాలయాధికారి డి.కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం పిల్లలకు చైర్ గేమ్స్ ఆడించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పిల్లలు ఖాళీగా తిరగకుండా రోజుకొక గేమ్‌తోపాటు, ప్రత్యేక కాంపిటేషన్ కోర్సులను చెబుతున్నామన్నారు.

రాజుకోడూరులో ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న ఏపీఓ శ్రీనివాస్

రాంబిల్లి, మే 20 : మండలంలోని 24 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఉపాధి పథకం ఏపీఓ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన రాజుకోడూరు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పంచాయతీల్లో పది రకాల పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. మండలంలో 4,760 మంది వేతనదారులు పనులను చేస్తున్నారన్నారు. ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు వేతనదారులు పనులు చేస్తున్నారన్నారు. రోజుకు రూ.270 నుంచి రూ.300 వరకు వేతనదారులకు కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. పనులు జరుగుతున్న ప్రదేశాల్లో చలువ పందిర్లు వేశామని, తాగునీరు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామని ఏపీఓ శ్రీనివాస్ తెలిపారు.

209వ రోజుకు చేరుకున్న పెదకలవలాపల్లి రైతుల నిరసన



పెదకవలాపల్లిలో నిరసన చేస్తున్న మహిళా రైతులు

రాంబిల్లి, మే 20 : గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ చుట్టూ నేవీ వారు ప్రహరీగోడ నిర్మాణం చేపడుతుండడంతో తాము అన్నివిధాల నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ పెదకలవలాపల్లి రైతులు చేస్తున్న నిరసన సోమవారానికి 209వ రోజుకు చేరుకుంది. ఈ కొండపై పనులు చేసుకోవడంతో పాటు, పశువులను మేపుకుంటూ జీవించేవారమన్నారు. కొండ పక్క నుంచి తమ పొలాలకు వెళ్లే దారులు ఉన్నాయని, డీఆర్‌డీవో ప్రహరీ నిర్మాణంతో దారులు కూడా మూసేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న ప్రభుత్వం, అధికారులు కనీసం పట్టించుకోకపోవడం బాధాకరమని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఎంపీటీసీ మాజీ సభ్యులు రావి దేముళ్లు, మహిళా రైతులు కోరుతున్నారు.

ఇంటింటికి చెత్త సేకరణకు బ్యాటరీ వాహనాలు



చెత్త సేకరణకు వినియోగిస్తున్న బ్యాటరీ వాహనాలు

ఎలమంచిలి, మే 20 : మునిసిపాలిటీలో తడి చెత్త, పొడి చెత్త సేకరణకు బ్యాటరీ వాహనాల సేవలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. రెండు నెలల క్రితం మునిసిపాలిటీలో ప్రజాప్రతినిధుల చేతులు మీదుగా ప్రారంభించిన ఈ వాహనాల సేవలను నిలిపివేశారు. అయితే సోమవారం నుంచి మునిసిపాలిటీకి వచ్చిన 13 బ్యాటరీ వాహనాల ద్వారా పారిశుధ్య కార్మికులు ఇంటింటా చెత్తను సేకరిస్తున్నారు.

ఆర్ఎంపీ వైద్యుడి

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- మృతుడు సత్యనారాయణ అల్లుడు తులసి ఆరోపణ
- సకాలంలో సరైన వైద్యం అందలేదని ఆవేదన
- ప్రాథమిక చికిత్స మాత్రమే చేశానన్న ఆర్ఎంపీ వైద్యుడు
- లింగంపేటలో విషాదఛాయలు



విలేకరులతో మాట్లాడుతున్న తులసి

కృష్ణాదేవిపేట, మే 20 : ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైందని ఓ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. వైద్యం సరిగా, సకాలంలో అందించకపోవడం వల్లే తాము కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయామని కంట తడి పెడుతున్నారు. ఇందుకు సంబంధించి మృతుడి అల్లుడు తులసి సోమవారం ఇక్కడ విలేకరులకు తెలిపిన వివరాలివి. గొలుగొండ మండలం లింగంపేట గ్రామానికి చెందిన నెల్లూరి సత్యనారాయణ (53) తన మామ అని పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీన అతనికి జ్వరం రావడంతో గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో గల అల్లూరి క్లినిక్‌కు తీసుకు వెళ్లామన్నారు. అక్కడ ఆర్ఎంపీ వైద్యుడు రామదాసు పరీక్షలు జరిపి పచ్చకామెర్లు రెండు శాతం ఉన్నాయని చెప్పారన్నారు. దీనిపై తాము నర్సీపట్నం వెళదామని అనుకున్నామన్నారు. ఇంతలో ఆర్ఎంపీ వైద్యుడు సత్యనారాయణకు మలేరియా, టైఫాయిడ్ పరీక్షల్లో నెగెటివ్ వచ్చిందని, ప్లేట్‌లెట్స్ బాగానే ఉన్నాయని వివరించారన్నారు. పచ్చకామెర్లకు ఏమీ ఫర్వాలేదని, మందులు ఇచ్చి వైద్యం అందిస్తే సరిపోతుందని తెలిపారన్నారు. తన మామ పరిస్థితి విషమంగా మారడంతో శుక్రవారం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. అక్కడి వైద్యులు పరీక్షలు జరిపి పచ్చకామెర్లు, సెరిబ్రల్ మలేరియా తీవ్రస్థాయిలో ఉందని నిర్ధారించారన్నారు. రోగికి సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించడం ఆలస్యమైందని చెప్పారన్నారు. వైద్య సేవల ఖర్చు ఎక్కువగా అవుతుందని, అయినా ప్రాణానికి తాము భరోసా ఇవ్వలేమని వారు తెలిపారని తులసి విలేకరులకు చెప్పారు. అంత స్థోమత లేక తాము అదే రోజు సాయంత్రం విశాఖ కేజీహెచ్‌కు రోగిని తీసుకు వెళ్లామన్నారు. అక్కడి వైద్యులు కిడ్నీలు, లివర్ పూర్తిగా పాడయ్యాయని చెప్పి వైద్య సేవలు అందించారన్నారు. ఆదివారం సాయంత్రానికి పరిస్థితి చాలా విషమంగా ఉందని చెప్పడంతో తిరిగి అక్కడి నుంచి లింగంపేటకు తీసుకు వచ్చేశామన్నారు. దీంతో ఆదివారం ఒంటి గంటల సమయంలో సత్యనారాయణ మృతిచెందారని వాపోయాడు. కేవలం ఆర్ఎంపీ వైద్యుడు, ల్యాబ్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తన మామయ్య మృతి చెందాడని అల్లుడు తులసితో పాటు కుటుంబ సభ్యులు విలపించారు. దీనిపై ఆర్ఎంపీ వైద్యుడు రామదాసును వివరణ కోరగా, తాను ప్రాథమిక చికిత్స చేశానే తప్ప మరే ఇతర వైద్యం చేయలేదన్నారు. సత్యనారాయణ మృతికి తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం పెరుగుదల

దేవరాపల్లి/రోలుగుంట, మే 20 : ఖరీఫ్ సీజన్‌లో భూమి సారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట విత్తనాలు వేయాలని దేవరాపల్లి మండల వ్యవసాయాధికారిణి ఎల్.వై.కాంతమ్మ, రోలుగుంట మండల వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి సూచించారు. సోమవారం వారు ఆయా మండలాల్లో విలేకరులతో మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై వీటిని అందిస్తున్నట్టు చెప్పారు. జీలుగు, జనుము విత్తనాలు పది కిలోల ధర రూ.880కాగా, ప్రభుత్వ సబ్సిడీ పోను 440కు అందిస్తున్నట్టు చెప్పారు. పిల్లిపెసర రూ.1072 కాగా రైతు రూ.536 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ విత్తనాలు కావల్సిన వారు ముందుకు తమ పేర్లను రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. పచ్చిరొట్ట వలన భూసారం పెరుగుతుందన్నారు.

ఉత్తమ నాటిక 'బంధం'



బంధం నాటిక కళాకారులకు జ్ఞాపిక, నగదు అందజేస్తున్న దాడి రత్నాకర్

కొత్తూరు, మే 20 : అనకాపల్లిలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు ఈనెల 17, 18, 19 తేదీల్లో అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీలకు జడ్జిలుగా కోరుకొండ శేషగిరిరావు, దండు నాగేశ్వరరావు, వీవీ రామారావు వ్యవహరించారు. ఈ నాటిక పోటీల ముఖ్య నిర్వాహకులు పీసీహెచ్. నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో నాటికల పోటీలు జరుగుతున్నాయన్నారు. అందులో అనకాపల్లికి వచ్చి ప్రదర్శించిన ఆరు సమాజాల కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నాటిక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా విజయవాడకు చెందిన మైత్రీ కళానిలయం వారి బంధం నాటిక, ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా విశాఖపట్నంనకు చెందిన 'కళాభినయ' నాటిక, ఉత్తమ తృతీయ ప్రదర్శనగా గుంటూరుకు చెందిన అమరావతి ఆర్ట్స్ 'అమృతహస్తం' నాటికకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా ఉత్తమ నటిగా బంధం నాటిక నుంచి రత్నకుమారి, ఉత్తమ నటుడుగా నాలోన నీవే నాటిక నుంచి రామకృష్ణకు, ఉత్తమ దర్శకులుగా బంధం నాటిక నుంచి పీవీ పురుషోత్తం, ఉత్తమ రచయితగా నాన్న బంగారు నాటిక మూర్తికి వ్యక్తిగత బహుమతులను రత్నాకర్ అందజేశారు. అనంతరం దాడి వీరభద్రరావు 45 ఏళ్ల క్రితం రచించిన అనగనగా ఒక రాజు నాటిక విశాఖపట్నం కళాకారులు పీసీహెచ్ నాయుడు బృందంతో ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలను పొందారు.

తాగునీటి సరఫరా అస్తవ్యస్తం

... 3వ పేజీ తరువాయి

రెండేళ్ల క్రితం మొదలయ్యాయి. కొన్ని వార్డుల్లో నీటి సరఫరా పైపులైన్ వేశారు. కాంట్రాక్టర్లకు రూ.22 కోట్లు బకాయిలు చెల్లించకపోవడంతో సంవత్సరం కాలంగా పనులు నిలిచిపోయాయి. కొత్త పైపులైన్ కోసం వార్డుల్లో బాగున్న సీసీ రోడ్లు తవ్వేశారు. పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ప్రైవేటు ఆర్వో ప్లాంట్ల నుంచి నీరు కొనుక్కొని తాగుతున్నారు. ప్రతి రోజూ 20 లీటర్ల ప్లాస్టిక్ డబ్బాలతో నీరు తెచ్చుకుంటున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పథకం పనులు పూర్తి చేయించి మంచినీటి సరఫరా సజావుగా సాగేలా చూడాలని వారు కోరుతున్నారు.

పడకేసిన నాడు-నేడు పనులు

... 3వ పేజీ తరువాయి

లేదు. జూన్ 4న ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాతే పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ విద్యా సంవత్సరంలోనూ ఇంటర్మీడియట్ విద్యార్థులకు మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందని పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై సర్వశిక్షా అభియాన్ ఇన్‌చార్జి ఈఈ రాంప్రసాద్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు జరిగాయన్నారు. ఎన్నికల ప్రక్రియతో సంబంధం లేకుండా కళాశాలలు తెరిచేలోగా కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. సుమారు 60 శాతం పనులు తుది దశలో ఉన్నాయని తెలిపారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు కూడా నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

... 3వ పేజీ తరువాయి

వారికి, అదేవిధంగా గతంలో సాధించిన మార్కుల కంటే మెరుగైన మార్కుల కోసం బెటర్‌మెంట్ పరీక్షలకు రాసేందుకు సిద్ధమైన విద్యార్థులకు ఈ నెల 24వ తేదీ నుంచి 31వ తేదీ వరకు రెండు పూటలా పరీక్షలు జరిపేందుకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. జిల్లాలో అర్బన్ పరిధిలో 4 సెంటర్లు, రూరల్ పరిధిలో 16 కలిపి మొత్తం 20 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశారు. అర్బన్ పరిధిలో అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం వస్తాయి. మిగిలినవి మండల కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అదేవిధంగా మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. సప్లిమెంటరీ పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 9,326 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 5,481 మంది,, మొత్తం 14,807 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సుజాత తెలిపారు.

ఆంక్షలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- పోలీసు అధికారులు హెచ్చరిక
- పలు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు
- పల్లెల్లో ప్రశాంత వాతావరణానికి పిలుపు



నర్సీపట్నంలో కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహిస్తున్న సీఐ కాంతికుమార్



బుచ్చెయ్యపేట మండలం నీలకంఠాపురం గ్రామస్థులతో సమావేశమైన డీఎస్పీ అప్పలరాజు

బుచ్చెయ్యపేట, మే 20 : ఎన్నికల కమిషన్ విధించిన ఆంక్షలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజు హెచ్చరించారు. మండలంలోని నీలకంఠాపురంలో సోమవారం ఆయన ఆంక్షలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కోడ్ అమలులో ఉన్నందున సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు, హింస, అల్లర్లకు పాల్పడితే కేసులు తప్పవని స్పష్టం చేశారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలను రెచ్చగొట్టే సందేశాలు, నిరాధార ఆరోపణలు తదితర వాటిని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయకూడదన్నారు. ఈ సమావేశంలో బుచ్చెయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కె.కోటపాడులో...

నర్సీపట్నం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు అన్నిచోట్లా పోలీస్ యాక్ట్ 30, 144వ సెక్షన్ అమలులో ఉంటాయని నర్సీపట్నం సీఐ కాంతికుమార్ తెలిపారు. సోమవారం ఆయన ప్రజలకు ధైర్యం కల్పించేందుకు కేంద్ర బలగాలతో ఇక్కడ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధాజ్ఞలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ ముగిసే వరకు గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు. కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సుధాకరరావు, ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : వచ్చే నెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఇందులో భాగంగా సోమవారం కె.కోటపాడు, చౌడువాడ, మేడిచర్ల, సింగన్నదొరపాలెం గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్ర బలగాలతో పాటు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

కొత్తకోటలో ఇరువర్గాలకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ అప్పలనాయుడు, చిత్రంలో ఎస్ఐ

రావికమతం, మే 20 : కొత్తకోటలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఆ రోజు జరిగిన గొడవలో ఉన్న యువకులు, ఇరుపార్టీల నాయకులకు కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ రోజు పోలింగ్ కేంద్రం వద్ద కొత్తకోట గ్రామానికి చెందిన కొంత మంది యువకులు పరస్పర దూషణలకు దిగారు. దీంతో పోలీసులు వారిస్తున్నప్పటికీ వినకుండా మరింతగా రెచ్చిపోవడంతో పోలీసులు అప్పట్లో వీడియో తీసి ఆనాడే మందలించి వదిలేశారు. సదరు వీడియోలో ఉన్న యువకులతో పాటు వైసీపీ, టీడీపీలకు చెందిన పలువుర్ని సర్కిల్ కార్యాలయానికి పిలిపించి సీఐ కౌన్సెలింగ్ చేశారు. అనవసర గొడవలకు దిగి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఎన్నికల కౌంటింగ్ జూన్ నాలుగో తేదీన జరగనుందని అంత వరకు ఎన్నికల కమిషన్ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. నిబంధనలను ఎవరు అతిక్రమించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో చీడికాడ మండలంలో పోలైన ఓట్లే అధికం



చుక్కపల్లి పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు (ఫైల్)

చీడికాడ, మే 20 : మాడుగుల నియోజకవర్గంలో 2019, 2024 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అధిక శాతం పోలింగ్ చీడికాడ మండలంలోనే జరిగినట్టు అధికారులు వెల్లడించిన వివరాల ఆధారంగా తెలుస్తోంది. 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలోని 1,85,791 ఓట్లకు గాను 1,56,880 ఓట్లు పోలయ్యాయి. ఇందులో చీడికాడ మండలానికి సంబంధించి 36, 570 ఓట్లుకు 31,314ఓట్లు పోలై 85.63శాతంగా నమోదైంది. మాడుగుల మండలానికి సంబంధించి 53,720 ఓట్లుకు 45,133 ఓట్లు పోలై 84.02 శాతం పోలింగ్‌గా నమోదైంది. అలాగే, దేవరాపల్లి మండలానికి సంబంధించి 46,965 ఓట్లకు 39, 456, కె.కోటపాడు మండలానికి సంబంధించి 48,536 ఓట్లకు 40,977ఓట్లు పోలయ్యాయి. ఇక ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని మొత్తం 1,88,989 ఓట్ల కాగా, 1,62,581 ఓట్లు పోలయ్యాయి. ఇందులో చీడికాడ మండలంలో 36,720 ఓట్లకు 32,381 ఓట్లు పోలై 88.18శాతంగా నమోదైంది. కె.కోటపాడు మండలంలో 49,135ఓట్లుకు 42,780 ఓట్లు, దేవరాపల్లి మండలంలో 47,015 ఓట్లుకు 40,488ఓట్లు, మాడుగుల మండలంలో 56,119 ఓట్లకు 46,924 ఓట్లు పోలయ్యాయి. కానీ అభివృద్ధి విషయంలో మాత్రం పై మూడు మండలాలకన్నా చీడికాడ మండలం అన్నింటా వెనుకబడి ఉన్నట్టు పలువురు వాపోతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మాడుగుల, మే 20 : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి ఆ ప్రాంత వాసులు తెలిపిన వివరాలివి. మాడుగుల జగ్గన్నచావడికి చెందిన గౌరీపట్టపు సత్యనారాయణ (50) సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. కాసేపటికి ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు 108 ద్వారా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు జరిపిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందినట్టు నిర్ధారించారు. సత్యనారాయణ కార్పెంటర్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ ఘటనతో అతని భార్య పద్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. అయితే ఈ సంఘటనపై సోమవారం రాత్రి 7.30 గంటల వరకు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు.

150 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు జరుపుతున్న వైద్యులు

కృష్ణాదేవిపేట, మే 20 : వారపు సంత సందర్భంగా కృష్ణాదేవిపేట బస్ స్టేషన్ వద్ద సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు జరిపారు. వీరిలో ముప్పై మందిని శస్త్రచికిత్సల నిమిత్తం ఎంపిక చేశారు. అనంతరం కొందరిని విశాఖలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించినట్టు వైద్యాధికారులు రాజశేఖర్, దుర్గాభవానీ తెలిపారు.

కేజేపురంలో తోడపెద్దుకు అంతిమ యాత్ర



తోడపెద్దును ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, మే 20 : మండలంలోని కేజేపురంలో వేగి అప్పలనాయుడుకు చెందిన తోడపెద్దు మృతి చెందడంతో సోమవారం గ్రామంలో అంతిమయాత్ర నిర్వహించారు. సింహాద్రి అప్పన్న ప్రతిరూపంగా కొలిచే తోడపెద్దు మృతి విషయం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని పూజలు జరిపారు. గ్రామ పురవీధుల్లో ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తీసుకు వెళ్లి అప్పలనాయుడు సొంత పొలంలో ఖననం చేశారు.

'ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య'

బుచ్చెయ్యపేట, మే 20 : కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం సీపీఎం నాయకుడు పినపాత్రుని సాంబశివరావు ఆధ్వర్యంలో ఇక్కడ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కీర్తించారు. ఈ కార్యక్రమంలో గొంతిన సన్నిబాబు, బత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు.

గోవాడలో ఘనంగా వెంకన్న కల్యాణం



వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చక స్వాములు

చోడవరం, మే 20 : మండలంలోని గోవాడ షుగర్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కల్యాణాన్ని ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు జీటీ ఆచార్యులు బృందం నిర్వహించారు. ఈ వేడుకల్లో షుగర్స్ ఎండీ వి.సన్యాసినాయుడు, అధికారులు, కార్మికులతో పాటు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'ఇక ప్రజల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి'



మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారావు

రావికమతం, మే 20 : ఇకపై అన్ని రకాల రెవెన్యూ శాఖ పరమైన సేవలకు ప్రజలు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా తహసీల్దార్ రమణారావు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా కొద్దిరోజులు రెవెన్యూ పరమైన సేవల్లో కాస్త జాప్యం జరిగిందన్నారు. ఎన్నికలు ముగిసినందున ఇకపై ప్రజలకు అందించాల్సిన సేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఆయా పత్రాలు కావాల్సిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. ఇదిలావుంటే, ఎన్నికల కౌంటింగ్ వచ్చే నెల నాలుగో తేదీన జరుగుతుందని, అంతవరకు అన్నిచోట్ల 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఇందుకు అనుగుణంగా మండల ప్రజలంతా నడుచుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

కేవెల్‌పురంలో క్షీణించిన పారిశుధ్యం



నగరం గ్రామంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు



కేఎల్ పురం గ్రామంలో...

నర్సీపట్నం అర్బన్, మే 20 : మండలంలోని కేఎల్‌పురం పంచాయతీ పరిధిలో పారిశుధ్యం క్షీణించింది. ఎక్కడికక్కడ చెత్తాచెదారంతో పాటు మురుగు దర్శనమిస్తోంది. దీంతో కేఎల్‌పురం, నగరం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎర్కొంటున్నారు. ఈ రెండు గ్రామాల్లో కాలువలు లేకపోవడంతో వాడుకనీరు రోడ్లపైకి చేరుతోంది. అదికాస్తమురుగుగా మారుతోంది. రాకపోకలకు వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. వీధుల్లో చెత్తకుప్పలు పేరుకుపోతుండడంతో దుర్వాసన వెదజల్లుతోందని అంటున్నారు. దీనికితోడు దోమల బెడద అధికంగా ఉందని చెపుతున్నారు. అసలే ఇటీవల కాలంలో వాతావరణంలో మార్పుల కారణంగా వర్షాలు కురుస్తున్నాయని, దీనివల్ల అంటువ్యాధుల భయం వెంటాడుతోందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య సమస్యకు పరిష్కారం చూపాల్సిందిగా అంతా కోరుతున్నారు.

మూడు మండలాల్లో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నిలిచిన నీరు
- గాలులకు నేలరాలిన మామిడి కాయలు



కృష్ణాదేవిపేటలో...



నర్సీపట్నం మండలం చెట్టుపల్లిలో కుండపోతగా కురుస్తున్న వర్షం



జోగంపేటలో...

నర్సీపట్నంఅర్బన్/గొలుగొండ/కృష్ణాదేవిపేట/మాడుగుల/మాడుగుల రూరల్ , మే 20 : వాతావరణంలో మార్పుల కారణంగా జిల్లాలోని నర్సీపట్నం, గొలుగొండ, మాడుగుల తదితర మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగడంతో పాటు ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. అనంతరం ఈదురు గాలులలో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. నర్సీపట్నం మండలంలోని చెట్టుపల్లి, గురందొరపాలెం, నీలంపేట, వేములపూడి, అమలాపురం గ్రామాల్లో ఎటుచూసినా నీరే కనిపించింది. గాలులకు చాలాచోట్ల మామిడికాయలు రాలిపోయాయి. దీంతో ఆయా రైతులు గగ్గోలు పెడుతున్నారు. అలాగే గొలుగొండల మండలం గొలుగొండ, జోగంపేట, కొత్తమల్లంపేట, పాకలపాడు, ఏటిగైరంపేట, రావణాపల్లి, చీడిగుమ్మల, గుండుపాల, ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, కొంగసింగి, చోద్యం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాలో కుండపోతగా వానపడింది. గ్రామీణ ప్రాంతాల ప్రధాన రహదార్లు, వీధిరోడ్లలో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. పలు చోట్ల డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో మురుగు వర్షపు నీటిలో చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఏఎల్‌పురం ఆర్టీసీ బస్‌స్టేషన్ చెరువును తలపించింది. అలాగే, మాడుగుల మండలంలోనూ ఇదే వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి భానుడు భగభగ మండినప్పటికీ మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో వర్షం కురిసింది. దీంతో అంతటా చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు.